https://teluguislam.net



# ఉమ్రయె ఖజా

ఇమామె హాకిమ్ ఇలా అంటున్నారు: "జీఖాదా మాసం చంద్రవంక అగుపడగానే దైవప్రవక్త (స) తమ అనుచరగణానికి, తప్పిపోయిన తమ ఉమ్రాను 'ఖజా'గా పూర్తి చేయండని, హుదైబియాలో హాజరైన వారిలో ఏ ఒక్కడూ ఆగిపోవడానికి వీల్లేదని ఓ ఆదేశాన్ని జారీ చేయగా, (ఈ మధ్య కాలంలో) ఎవరైతే అమరగతినొందారో వారు తప్ప మిగిలిన వారందరూ ఉమ్రా చేయడానికి బయలుదేరారు. హుదైబియాలో పాల్గొన్న వారే కాకుండా ఇంకా కొందరు ఉమ్రా చేయడానికిగాను వెంట రావడం జరిగింది. వారందరి సంఖ్య మొత్తం రెండు వేలకు చేరింది. స్త్రీలు, పిల్లలు వారికి అదనం.[1]

ఈ సందర్భంగా మహాప్రవక్త (స), అబూ రహ్మ్ (ర)ను తమ స్థానంలో మదీనా బాగోగులను చూడడానికి నియమించడం జరిగింది. అరవై ఒంటెలను వెంటబెట్టుకొని వాటిని పరిరక్షించేందుకు నాజియా బిన్ జుందుబ్ (ర)ను నియమించారు. 'జుల్ హలీఫా' అనే ప్రదేశం నుండి ఉమ్రా 'ఎహ్రామ్' కట్టి 'లబ్బైక్' పలికారు. ఆయనతో సహా ముస్లిములందరూ లబ్బైక్ అన్నారు. ఖురైష్‌వారు ఏదైనా వాగ్దానభంగానికి పాల్పడతారేమోననే ఉద్దేశ్యంతో అందరూ ఆయుధధారులై మరీ బయలుదేరారు. 'యాజిజ్' లోయకు చేరగానే ఆయుధాలన్నిటినీ అంటే ఢాళ్ళు, బాణాలు, బల్లేలు వగైరాలన్నిటిని ఆ ప్రదేశంలో ఉంచి, వాటిని సంరక్షించడానికి అవస్ బిన్ ఖౌలీ అన్సారీ (ర) గారి నాయకత్వంలో రెండొందల మందిని నియమించి, అశ్వారూఢులు ఉపయోగించే ఆయుధం మరియు ఒరలో ఉంచిన ఖడ్గం మాత్రమే తీసుకొని మక్కాలో ప్రవేశించారు.[2]

దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశించేటప్పుడు 'కస్వా' పేరుగల ఒంటెపై

---

1. ఫత్‌హుల్ బారి-7/500.
2. ఫత్‌హుల్ బారి-7/500; జాదుల్ ముఆద్-2/151తో సహా.

https://teluguislam.net



స్వారీ చేస్తున్నారు. ముస్లిములు ఖడ్గాలను మెడలకు తగిలించుకొని దైవప్రవక్త (స)ను చుట్టుముట్టి లబ్బైక్ పలుకుతున్నారు.

ముష్రిక్కులు ముస్లిములను చూడడానికి తమ ఇండ్ల నుండి బయటకు వచ్చి కాబాకు ఉత్తరాన ఉన్న 'జబ్లె ఖైకాన్' కొండ పైకి ఎక్కి కూర్చున్నారు. వారు పరస్పరం మాట్లాడుకుంటూ, "మీ వద్దకు వస్తున్న వారిని యస్రిబ్ జ్వరం పూర్తిగా నీరసులుగా చేసివేసింది" అని అనుకోజొచ్చారు. దైవప్రవక్త (స) తమ అనుచరులకు (సహాబాకు) ఆదేశమిస్తూ, ప్రదక్షిణ లేక తవాఫ్‌లో మొదటి మూడు ప్రదక్షిణలు పరుగెత్తుతూ చేయండని, అయితే 'రుక్నె యమాని' మరియు 'హజ్రె అస్వద్' (యమన్ వైపున ఉన్న కాబా గృహం మూల మరియు హజ్రె అస్వద్ ఉన్న ప్రదేశానికి నడుమ ఉన్న చోటు అంటే కాబా దక్షిణ గోడ) వరకు నడుస్తూ వెళ్ళమని చెప్పారు. ఈ ఆదేశం ఇవ్వడానికి కారణం కేవలం దైవకారుణ్యం పొందడమే కాకుండా, ముష్రిక్కులు వారి శక్తిని కూడా అంచనా వేసుకోవాలనే ఉద్దేశ్యం కూడా ఆ ఆదేశంలో ఉంది.[3] ఇదేకాక ఆయన(స) సహాబాకు 'ఇజ్‌తిబా' చేసే ఆదేశం కూడా ఇచ్చారు. ఇజ్‌తిబా అంటే కుడి భుజంపై ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా చేయడం. (పైన కప్పుకున్న అంగవస్త్రం అంచును కుడి చంక క్రింది నుండి తీసి వెనుకా ముందుగా రెండో అంచును ఎడమ భుజంపై వేసుకోవడం).

దైవప్రవక్త (స) మక్కాలోనికి ప్రవేశించిన మార్గం, కొండ లోయగుండా వెళ్ళి 'హజూన్'కు చేరే మార్గం. ముష్రిక్కులు మహాప్రవక్త (స) మరియు ఆయన అనుయాయుల్ని చూసేందుకు వరుసకట్టి నిలబడి ఉన్నారు. ఆయన (స) ఆపకుండా లబ్బైక్ పలుకుతూ (హరమ్ లోనికి చేరి) తన చేతికర్రతో హజ్రె అస్వద్‌ను తాకారు. అక్కడి నుండి ప్రదక్షిణ ప్రారంభించారు. తక్కిన ముస్లిములు కూడా ఆయన్ను అనుసరించారు. అప్పుడు అబ్దుల్లా బిన్ రవాహా (ర) తన కరవాలాన్ని ధరించి దైవప్రవక్త (స) ముందు నడుస్తున్నారు. అలా నడుస్తూ ఈ యుద్ధ గీతాన్ని ఆలపిస్తున్నారు.

"దైవ తిరస్కారుల మనుమల్లారా! ఈయన కోసం మార్గాన్ని వదలండి. సకల శ్రేయాలు ఈ ప్రవక్త (స) వద్దే ఉన్నాయి కాబట్టి ఆయన మార్గానికి అడ్డుతొలగండి. ఆ శ్రేయం రహ్మాన్ తన గ్రంథంలో అవతరింపజేశాడు. అంటే,

3. సహీహ్ బుఖారి-1/218, 2/610,611; సహీ ముస్లిమ్-1/412.

https://teluguislam.net



ఆయన ప్రవక్తపై పఠించబడే గ్రంథం అన్నమాట. ఓ ప్రభూ! నేను వీటిని విశ్వసిస్తున్నాను. దాన్ని స్వీకరించడమే సత్యమార్గం అని నాకు తెలుసు- మేలైన హత్య అల్లాహ్ మార్గంలో చేసే హత్య. నేడు అవతరించిన ఈ గ్రంథం ప్రకారం మేము మీపై వేసే వ్రేటుకు మీ కపాళం బ్రద్దలవుతుంది. ఈ దెబ్బ స్నేహాన్ని త్రెంచేస్తుంది."[4]

ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర), హజ్రత్ రవాహాతో, "ఓ రవాహా! నీవు దైవప్రవక్త (స) ఎదుట, అల్లాహ్ గృహంలోనా ఈ పద్యపాదాల్ని వల్లిస్తున్నావు?" అని అడిగారు. దీనికి మహాప్రవక్త (స), "ఓ ఉమర్! వల్లించనీ! ఈ పద్య పాదాలు వారికి బాణాలకంటే ఎక్కువగా గ్రుచ్చుకొని బాధిస్తున్నాయి" అన్నారు.[5]

మహాప్రవక్త (స) మరియు ముస్లిములంతా మూడు ప్రదక్షిణలు పరుగిడుతూ చేయగా, ముష్రిక్కులు అది చూసి, "వీరి గురించి మనం జ్వరం వారిని నిర్వీర్యం చేసేసిందని అనుకున్నాంగాని వారు ఫలానా, ఫలానా వారి కంటే కూడా బలవంతులు" అని అనుకోజొచ్చారు.[6]

తవాఫ్ పూర్తి అయిన పిదప ఆయన(స) సఫా మరియు మర్వా కొండల నడుమ సయీ చేశారు. అప్పుడు ఆయన హదీ అంటే ఖుర్బానీ పశువులు మర్వా వద్ద నిలబడి ఉన్నాయి. ఆయన సయీ పూర్తి చేసిన తరువాత "ఇది బలి స్థానం, మక్కా వీధులన్నీ బలి స్థానాలే" అని సెలవిచ్చారు. ఆ తరువాత మర్వా వద్దనే ఖుర్బానీ పశువులను బలి ఇవ్వటం జరిగింది. ఆ చోటే తమ తలను గొరిగించుకున్నారు. ముస్లిములు కూడా తమ తల వెంట్రుకలను గొరిగించుకున్నారు. కొందరిని 'యాజిజ్'కు పంపి అక్కడున్న ఆయుధాల సంరక్షణా బాధ్యతను తీసుకొని అక్కడున్న వారిని ఉమ్రా కోసం పంపించమని చెప్పి పంపారు.

మహాప్రవక్త (స) మక్కాలో మూడు రోజుల వరకు మకాం వేశారు. నాల్గవ రోజు తెల్లారిన తరువాత ముష్రిక్కులు హజ్రత్ అలీ (ర) వద్దకు

---

4. ఉల్లేఖనాల్లో ఈ పద్యపాదాలు వాటి క్రమం వేరువేరుగా ఉంది. వాటన్నిటినీ ఓ చోట చేర్చి రాయడం జరిగింది.
5. జామె తిర్మిజీ, అబ్వాబుల్ ఇస్తీజాన్ వల్ అదబ్, జాబుత్ మాజా అఫీర్రిన్షా వష్షేర్-2/107.
6. సహీ ముస్లిమ్-1/412.

https://teluguislam.net



వచ్చి, "మీ నాయకునితో, గడువు తీరిపోయింది వెనక్కు వెళ్ళిపొమ్మని చెప్పండి" అని అన్నారు. పిదప దైవప్రవక్త (స) మక్కా నుండి బయలుదేరి సర్ఫ్ అనే ప్రదేశంలోనికి వచ్చి విడిది చేశారు.

మక్కా నుండి బయలుదేరేటప్పుడు, హజ్రత్ హమ్జా (ర)గారి కుమార్తె బాబాయి, బాబాయి అంటూ వెంటబడింది. ఆమెను హజ్రత్ అలీ (ర) ఎత్తుకున్నారు. ఆ తరువాత ఆమె గురించి హజ్రత్ అలీ (ర), హజ్రత్ జాఫర్ (ర) మరియు హజ్రత్ జైద్ (ర) నడుమ వివాదం వచ్చింది (ప్రతి వ్యక్తీ తానే ఆ అమ్మాయి పోషణకు హక్కుదారుణ్ణని వాదించసాగాడు). దైవప్రవక్త (స) హజ్రత్ జాఫర్(ర) గారికి అప్పగించారు. ఎందుకంటే ఆ అమ్మాయి చిన్నమ్మ ఆయనకు భార్య కాబట్టి.

ఈ ఉమ్రా సందర్భంలోనే దైవప్రవక్త (స)కు, హజ్రత్ మైమూనా బిన్తె హారిస్ ఆరియా (ర)తో వివాహం జరిగింది. దైవప్రవక్త (స) మక్కాలో ప్రవేశించక ముందే, హజ్రత్ జాఫర్ బిన్ అబూ తాలిబ్ (ర)ను వివాహ సంబంధం గురించి మాట్లాడమని మైమునా (ర) వద్దకు పంపించి ఉన్నారు. ఆమె ఈ వ్యవహారాన్ని హజ్రత్ అబ్బాస్ (ర) కు అప్పగించారు. అప్పటికే హజ్రత్ మైమునా సోదరి హజ్రత్ ఉమ్ముల్ ఫజల్ ఆయన వివాహ బంధంలో ఉన్నారు. హజ్రత్ అబ్బాస్ (ర) మైమునా (ర) గారిని దైవప్రవక్త (స)కు ఇచ్చి వివాహం చేశారు. మక్కా నుండి తిరిగి వచ్చేటప్పుడు, హజ్రత్ మైమునా (ర)ను తోడ్కొని రమ్మని హజ్రత్ అబూ రాఫె (ర)ను అక్కడే వదిలి వచ్చేశారు. దైవప్రవక్త (స) సర్ఫ్‌కు చేరేటప్పటికి ఆయన మైమునా (ర)ను సన్నిధికి గొనివచ్చారు.[7]

ఈ ఉమ్రా పేరు 'ఉమ్రయె ఖజా'గా పడిపోవడానికి కారణం, బహుశా ఇది హుదైబియా ఉమ్రాకు బదులుగా చేసిన ఉమ్రా అయినా కావచ్చు లేదా హుదైబియా ఒప్పందంలో నిర్ణయించిన షరతులకు అనుగుణంగానైనా జరిగి ఉండవచ్చు. రెండో కారణాన్నే పరిశోధకులు సరియైనదిగా తలుస్తారు.[8] అదేకాకుండా దీన్ని నాల్గు రకాలుగా కూడా పిలుస్తారు. 1. ఉమ్రయె ఖజా, 2. ఉమ్రయె ఖజియా, 3. ఉమ్రయె ఖిసాస్, 4. ఉమ్రయె సులాహ్.

---

*7. జాదుల్ ముఆద్-2/152*

*8. జాదుల్ ముఆద్-1/172; ఫత్‌హుల్ బారి-7/500*

https://teluguislam.net



## మరికొన్ని సరియ్యాలు

### 1. సరియ్యా అబుల్ ఇవజా (జిల్‌హజ్జా మాసం, హి.శ. 7)

దైవప్రవక్త (స), యాభై మందిని హజ్రత్ అబుల్ ఇవజాకు ఇచ్చి బనూ సులైమ్ తెగవారిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానించమని పంపించారు. కాని బనూ సులైమ్‌కు ఇస్లామ్ వైపునకు రమ్మని పిలుపునివ్వగా వారు, "మీరు దేని వైపునకైతే మమ్మల్ని పిలుస్తున్నారో అది మాకు అవసరం లేదు" అంటూ వారితో యుద్ధానికి దిగారు. భీకర పోరాటం జరిగింది. ఆ పోరాటంలో హజ్రత్ అబుల్ ఇవజా గాయపడ్డారు. అయినప్పటికీ ముస్లిములు శత్రువులకు చెందిన ఇద్దరిని బందీలుగా పట్టుకొని వచ్చారు.

### 2. సరియ్యా గాలిబ్ బిన్ అబ్దుల్లాహ్ (సఫర్ నెల, హి.శ. 8)

ఈయనకు రెండొందల మందినిచ్చి ఫిదక్ చుట్టుపట్ల హజ్రత్ బషీర్ బిన్ సఅద్ సహచరులు అమరగతినొందిన ప్రదేశానికి పంపించారు మహాప్రవక్త (స). వీరు శత్రువుల పశువులను హస్తగతం చేసుకుని అనేక మందిని హత మార్చారు.

### 3. సరియ్యా జాతె అత్లహ్ (రబీవుల్ అవ్వల్ నెల, హి.శ. 8)

ఈ సరియ్యా వివరాలు ఇలా ఉన్నాయి. బనూ ఖుజాఅ వారు ముస్లిములపై దాడి చేయడానికి పెద్ద సైన్యాన్ని సమీకరించుకొని ఉన్నారు. ఈ వార్త మహాప్రవక్త (స)కు తెలిసింది. ఆయన 'కఅబ్ బిన్ ఉమైర్ (ర)' గారి నేతృత్వంలో కేవలం పదిహేను మంది సహాబాలనే అటు వైపునకు పంపించారు. సహాబా (ర)కు వారు ఎదురుపడినప్పుడు వారిని ఇస్లామ్ ధర్మం వైపునకు ఆహ్వానించడం జరిగింది. కాని వారు ఇస్లామ్ స్వీకరించడానికి బదులు సహాబా (ర)ను బాణాలు సంధించి అందరినీ షహీద్ చేశారు. కేవలం ఒకే ఒక వ్యక్తి బ్రతికి ఉండగా ఆయనను హతుల నడుమ నుండి ఎత్తుకు రావడం జరిగింది.[9]

---

*9. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/231*

https://teluguislam.net



## 4. సరియ్యా జాతె అర్‌్ఖ (రబీవుల్ అవ్వల్ హి.శ. 8)

బనూ హవాజిన్ తెగ ఎడతెగకుండా శత్రువుకు సహాయం అందిస్తూ ఉండేది. అందుకని పాతిక మందిగల ఓ పటాలాన్ని హజ్రత్ షుజా బిన్ వహబ్ అసదీ (ర)గారికిచ్చి అటు పంపించడం జరిగింది. వీరు శత్రువులకు చెందిన పశువులను మాత్రమే తోలుకొని వచ్చారు. పోరాటం జరిగే అవకాశం కలుగలేదు.[10]

---

*10. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/231; తల్‌ఖీహుల్ ఫహూమ్-పుట.33 (అధఃస్సూచిక)*